క్లుప్తంగా

నెట్టికంటుడి సన్నిధిలో ఎంపీ గోరంట్ల మాధవ్



ఎంపీ మాధవ్ దంపతులకు స్వామి తీర్థప్రసాదాలను అందిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ దంపతులు శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఉదయాన్నే ఆలయానికి చేరుకున్న మాధవ్ దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా వారు ఆలయంలో స్వామికి అభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి స్వామి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

మద్యం పట్టివేత

యల్లనూరు: మండలంలోని నిట్టూరు, అచ్యుతాపురంలో అక్రమంగా మద్యం అమ్ముతుండగా శనివారం సెబ్ పోలీసులు పట్టుకున్నారు. నిట్టూరు గ్రామంలోని ఓ హోటల్‌లో నరేంద్ర అమ్ముతుండగా 14 మద్యం సీసాలను, అచ్యుతాపురంలో రాజేశ్వరి నుంచి 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

పన్నులు వంద శాతం వసూలు చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ సుమన జయంతి

గార్లదిన్నె: గ్రామ పంచాయతీల్లో వందశాతం పన్నులు చేయాలని డీఎల్‌పీఓ సుమన జయంతి పేర్కొన్నారు. శనివారం కల్లూరు పంచాయతీ కార్యాలయాన్ని డీఎల్‌పీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఆమె పంచాయతీ కార్యాలయంలో పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పంచాయతీలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రికార్డులు అన్నీ అప్‌డేట్ చేయాలన్నారు. పంచాయతీలో భవన నిర్మాణాలకు దరఖాస్తు చేసుకుంటే అహుడాకు పంపించాలన్నారు. ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

గ్రామ సచివాలయాల తనిఖీ

పుట్లూరు: అరకటివేముల, కడవకల్లు గ్రామ సచివాలయాలను శనివారం ఎంపీడీఓ యోగానందరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ సచివాలయాల్లో రికార్డులను పరిశీలించారు. అనంతరం సచివాలయ పరిధిలో స్పందన కింద వచ్చిన పిర్యాదులు, వలంటీర్ల పనితీరుపై ఆరా తీశారు. ప్రజలకు త్వరితగతిన సేవలను అందించాలని, ఉద్యోగులు సమయపాలన పాటించాలని సూచించారు.

అంబేడ్కర్ స్ఫూర్తి కొనసాగించాలి



కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యాంగ అవగాహన వేదిక సభ్యులు

గుంతకల్లుటౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ స్ఫూర్తిని అందరం కొనసాగించాలని రాజ్యాంగ అవగాహన వేదిక కన్వీనర్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, దాని ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. వేదిక కోకన్వీనర్లు సునీల్, వేణుగోపాల్, ప్రతినిధులు రామాంజినేయులు, నాగరాజు, సరస్వతి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



రంగనాథస్వామిని దర్శించుకుంటున్న ఏఎస్పీ దంపతులు

తాడిపత్రిటౌన్: రూరల్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం అడిషనల్ ఎస్పీ హనుమంతు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్‌లో తాగునీరు, మరుగుదొడ్ల తదితర సదుపాయాలపై ఆరా తీశారు. ఆలూరులోని రంగనాథస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఆలూరు రామచంద్రారెడ్డి, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. స్థల పురాణం, ఆలయ విశిష్టతను వివరించారు. ఏఎస్పీ దంపతులు స్వామివార్లకు అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్ఐ గౌస్‌మహ్మద్ ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



సచివాలయ సిబ్బందితో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. శనివారం అప్పేచర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో స్థానిక సమస్యలపై చర్చించారు. త్వరలో ప్రతి గ్రామానికి వెళ్లి ప్రజా సమస్యలపై అడిగి తెలుసుకుంటానన్నారు. గతంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే సహించబోమని హెచ్చరించారు. అనంతరం రైతుల సమస్యలు, పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంటల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్మన్ కొట్టాలపల్లి హరినాథరెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చింతబరరెడ్డి, భీమునిపల్లి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషారెడ్డి, వైస్ ఎంపీపీ హరినాథరెడ్డి, సర్పంచ్ రాములు, నాయకులు భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, గరుడశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



డ్రోన్ ద్వారా మందుల పిచికారీని పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

గుత్తి రూరల్: కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఏఓ ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. శనివారం బసినేపల్లి, బసినేపల్లి తండా గ్రామాల్లో వికసిత్ భారత్, సంకల్ప యాత్ర కార్యక్రమం, డ్రోన్ ద్వారా పంటలకు మందుల పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఏఓ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రైతులకు అందుతున్న పథకాలను తెలియజేశారు. నానో యూరియా, నానో డీఏపీ ఉపయోగాలను వివరించారు. ఏడీఏ వెంకట్రాముడు, ఏఓ ముస్తాక్ అహ్మద్, ఎంపీడీఓ శివాజీరెడ్డి, ఎంఈఓ రవినాయక్, సర్పంచ్ మహబూబ్‌బీ, అభ్యుదయ రైతు సుభాష్‌రెడ్డి, పీఆర్ ఏఈ మల్లేష్ నాయక్ పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటరమణప్ప సూచించారు. శనివారం కొంగనపల్లి, ఓబుళాపురం పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించిన అధికారులు కేంద్ర పథకాలను ప్రజలకు తెలియజేశారు. డ్రోన్ పనితీరును డెమో ద్వారా చూపించారు. కొంగనపల్లి, ఓబుళాపురం సర్పంచ్‌లు లక్ష్మిదేవి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

యల్లనూరు: బొప్పేపల్లి, కూచివారిపల్లి సచివాలయాల వద్ద ఎంపీడీఓ వీరరాజు ఆధ్వర్యంలో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్రపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నపథకాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచు లక్ష్మీనారాయణస్వామి, ఏడీఏ చెంగల్‌రాయుడు, ఏఓ రామకృష్ణ, ఏపీఎం ముత్యాలప్ప, కార్యదర్శులు సుజాత, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయండి

గుత్తి రూరల్: గుత్తి మునిసిపాలిటీతో పాటుగా మండల వ్యాప్తంగా తప్పుల్లేని ఓటరు జాబితాను తయారు చేయాలని తహసీల్దార్ మహబూబ్‌బాషా సూచించారు. పట్టణంలోని కార్యాలయంలో శనివారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలు, డబుల్ ఎంట్రీలు, మరణించిన వారి ఓట్లను తొలగించాలన్నారు. వీఆర్‌ఓలు పవిత్ర, కిశోర్, రంగయ్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్షయ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ

యల్లనూరు: యల్లనూరు, తిమ్మంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని క్షయ బాధితులకు వైద్యులు శివసాయి, టీబీ యూనిట్ సీనియర్ సూపర్‌వైజర్ సునీల్ శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఎంఎల్‌హెచ్‌పీలు శృతి, సుప్రియ, సీహెచ్ఓ మధుకుమార్, లక్ష్మీనారాయణమ్మ, సూపర్‌వైజర్లు రాము, హాజీవలి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాలను దర్శించుకున్న ఏఎస్పీ



చింతల స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఏఎస్పీ దంపతులు

తాడిపత్రిటౌన్: పట్టణంలోని చింతలవెంకటరమణ స్వామి, బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయాలను శనివారం అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి దంపతులు దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో అర్చకులు వారికి సాదర స్వాగతం పలుకుతూ స్థల పురాణం, ఆలయ విశిష్టతను గురించి వివరించారు. స్వామి వార్లకు ఏఎస్పీ దంపతులు అర్చనలు చేశారు. డీఎస్పీ గంగయ్య, ఎస్ఐ ధరణీబాబు పాల్గొన్నారు.

డిజిటల్ టెక్నాలజీపై అవగాహన



మాట్లాడుతున్న శ్రీనివాస రామానుజన్

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం డిజిటల్ టెక్నాలజీ, ఇండస్ట్రీ ఎక్స్‌పెక్టేషన్స్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. టీసీఎస్ కంపెనీ క్లౌడ్ యూనిట్ డెలివరీ హెడ్ శ్రీనివాస రామానుజన్ మాట్లాడుతూ ఐటీ పరిశ్రమల మెలకువలు విద్యార్థులకు వివరించారు. ఇండస్ట్రీ 4.0, సోషల్ మీడియా, ఐఓటీ, డేటా అనలిటిక్స్, ఏఎల్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, సీఎండీ రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సురయ, హెచ్‌ఓడీలు ఇంతియాజ్ బాషా, నమ్రత తదితరులు పాల్గొన్నారు.

‘అండగా నేనుంటా.. బాగా పని చేయండి’



కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: ‘పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచండి. మీరు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. మీకు అండగా నేనుంటా’ అని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పారిశుధ్య కార్మికులకు భరోసా కల్పించారు. శనివారం తెల్లవారుజామున ఆయన పాత మున్సిపల్ కార్యాలయంలో కార్మికుల మస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులతో మాట్లాడారు. కార్మికులు ప్రలోభ పెట్టి పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వర్తించకుండా బెదిరింపులకు గురి చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. అధికార పక్షానికి ప్రజల్లో చెడ్డపేరు రావాలన్న దురుద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. వీటన్నింటి పక్కన పెట్టి మీ ఇబ్బందులు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి



కాలనీవాసులతో మాట్లాడుతున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణ శివార్లోని దోనిముక్కల రోడ్డు ఎడమవైపు గల కాలనీల్లో నీటి సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయా కాలనీల్లో పర్యటించారు. కస్తూరిబా స్కూల్ వద్ద నున్న ట్యాంక్ నుంచి పైప్‌లైన్ ఇంటర్ కనెక్షన్‌ను ఏర్పాటు చేయడం ద్వారా శాశ్వత నీటి పరిష్కారానికి ఆస్కారం ఉంటే ఆ దిశగా చర్యలు చేపట్టాలని చెప్పారు. అప్పటివరకు పవర్‌బోర్లను మరమ్మతులు చేయించి తాత్కాలికంగా నీటి సమస్య పరిష్కరించాలన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయిస్తామని ఆయన ప్రజలకు తెలియజేశారు. ఎంఈ గురప్పయాదవ్, డీఈ రామ్మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

పెద్దవడుగూరు: మండలంలోని మిడుతూరు సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతదేహమై కనిపించాడు. శనివారం ఉదయం 44వ జాతీయ రహదారి పక్కనే ఉన్న శ్రీసత్యసాయి వాటర్ స్కీమ్ పంప్ హౌస్ ఓ మహిళ చిత్తు బాటిళ్లు ఏరుకుంటున్న సమయంలో దుర్వాసనను గమనించి స్థానికులకు తెలపడంతో వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. పంప్ హౌస్ పక్కనే ఉన్న మూతపడిన ఓ ధాబా మరుగుదొడ్డిలో పూర్తిగా కుళ్లి పురుగులు పట్టిన పురుషుడి మృతదేహాన్ని గుర్తించి, విషయాన్ని వెంటనే పోలీసులకు చేరవేశారు. యాడికి సీఐ శంకరరెడ్డి, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాలేదు. దాదాపు పది రోజుల క్రితం మృతిచెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వృద్ధుడి ఆత్మహత్య



చిన్ననారాయణ (ఫైల్)

తాడిపత్రి టౌన్: నందలపాడుకు చెందిన కామపాటి చిన్ననారాయణ (80) ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం ఉదయం పుట్లూరు రోడ్డులోని పట్టాలపై చేరుకుని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ముగిసిన ఎన్‌సీసీ ఉత్సవాలు

పామిడి: స్థానిక టీసీ హైస్కూల్‌లో రెండురోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌సీసీ ఉత్సవాలు శనివారం ముగిసింది. ఎస్‌బీఐ మేనేజర్ విక్రమ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణ విద్యార్థుల్లో క్రమశిక్షణకు దోహదపడుతుందన్నారు. అనంతరం క్రీడాపోటీల విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు.

మహిళల అభ్యున్నతికి కృషి చేయాలి



పెద్దవడుగూరులో మాట్లాడుతున్న న్యాయవాది శిరీష

పెద్దవడుగూరు: సమాజంలోని ప్రతి వ్యక్తి మహిళల అభ్యున్నతికి కృషి చేయాలని ఆర్డీటీ టెక్నికల్ డైరెక్టర్ భావనారాయణ, ఏటీఎల్ నారాయణ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణమండపంలో స్త్రీ హింస నిర్మూలన దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారి వెంట విద్యార్థులతో సంఘం సభ్యులు ర్యాలీ చేపట్టారు. గుత్తి రోడ్డు సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి నినాదాలు చేశారు. సీఓలు మంజుల, నాగమణి, శాంతరాజు, లాలుస్వామి, గంగాధర్ పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్డీటీ డైరెక్టర్ చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. అంతర్జాతీయ స్త్రీహింస నిర్మూలన కార్యక్రమాన్ని శనివారం ఆర్డీటీ ఏటీఎల్ వరకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక దోనిముక్కల రోడ్డు సమీపంలోని ఆర్డీటీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిదన సమావేశంలో ఆర్డీటీ డైరెక్టర్, ఎస్కేపీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాలాబాయి, లెక్చరర్ వెంకటేశ్వరరావు, మాంటిస్సోరి స్కూల్ కరస్పాండెంట్ నాగార్జున రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి తదితరులు మాట్లాడారు. సోషల్ యాక్షన్ టీమ్ లీడర్స్ చంద్రమ్మ, శ్రీరామ్ నాయక్, సునీత, రాధ, మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: ప్రస్తుతం సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఆర్డీటీ ఏటీఎల్ సుధాకర్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలోని అనంతపురం తాడిపత్రి రహదారిపై ర్యాలీ నిర్వహించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్, ఆర్ఈఈ జ్యోతి ఎఫ్ఓ ఆంజినేయులు, సీఓలు సాయిలీల, అమర్‌నాథ్‌రెడ్డి, ఆనంద్, సుధాకర్ విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్తి కోటను పర్యాటకంగా తీర్చిదిద్దాలి



ప్రపంచ వారసత్వ వారోత్సవాలపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: చారిత్రక గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని వక్తలు కోరారు. గుత్తిలో శనివారం ఏపీ టూరిజం, పురావస్తు శాఖ, ఇంటాక్ ఆధ్వర్యంలో ప్రపంచ వారసత్వ వారోత్సవాలను నిర్వహించారు. మస్రో సత్రం వద్ద ఉన్న హంపన్న సమాధి వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. ఇంటాక్ ప్రెసిడెంట్ రామకుమార్, టూరిజం జిల్లా అధికారి నాగేశ్వర రెడ్డి, పురావస్తు శాఖ అధికారి బాలకృష్ణారెడ్డి, పురావస్తు ఏడీ రజిత, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్ బీ, కమిషనర్ శ్రీనివాసులు గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ఎంఈఓ రవి నాయక్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. హంపన్న సమాధి వద్ద నుంచి గాంధీ సర్కిల్ ,ఆర్టీసీ బస్టాండ్, రాయల్ సర్కిల్ వరకు అంటు నుంచి తిరిగి అమృత్ సినిమా థియేటర్, బసవేశ్వర దేవాలయం మీదగా కోట వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి, గుత్తి కోట పరిరక్షణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు విరూపాక్షిరెడ్డి, ఇస్మాయిల్, కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విజయభాస్కర్, కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పీరా, రామదాసు, రఫి, రవి, జోయెల్ పాల్గొన్నారు.

తూనికలు, కొలతల అధికారుల తనిఖీలు



వేయింగ్ మిషన్‌ను తనిఖీ చేస్తున్న తూనికలు కొలతల శాఖ అధికారి శంకర్

యాడికి: మండలంలోని పలు దుకాణాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారి శంకర్ శనివారం ఉదయం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. యాడికిలోని శివసాయి విఘ్నేశ్వర ఏజెన్సీలో ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్‌కు సీలు లేకపోవడంతో రూ.15వేల జరిమానా విధించారు. జొన్నల తూకాల్లో రైతులను కమీషన్ ఏజంట్ మోసం చేస్తున్నట్లు గుర్తించి రూ.25వేలు అపరాధ రుసుం విధించారు. పెయింట్స్ విక్రయ దుకాణంలో ఎమ్మార్పీ తొలగించి అమ్మకాలు సాగిస్తుండడం గమనించి యజమానికి, అక్రమాలకు పాల్పడుతున్న హోటల్, కిరాణా దుకాణాల యజమానులకు జరిమానా విధించారు. దాదాపు రూ.60 వేలు చొప్పున అపరాధ రుసుం విధించినట్లు అధికారి తెలిపారు. తూనికల శాఖ అధికారి తనిఖీల విషయం తెలుసుకున్న రులు దాడులు చేస్తున్నారనే సమాచారంతో పలు దుకాణాలను నిర్వాహకులు మూసి, అజ్ఞాతంలోకి వెళ్లారు.


గుట్టుగా మత్స్యకార కమిటీ ఎన్నిక

పెద్దపప్పూరు: ముచ్చుకోట ప్రాజెక్టుకు సంబంధించి మత్స్యకార కమిటీ ఎన్నిక గుట్టుగా నిర్వహించినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంఘంలోని మెజారీ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వలేదని సమాచారం. సంఘంలో దాదాపు 50 మంది దాకా సభ్యులుండగా కేవలం 15 మంది మాత్రమే హాజరై కమిటీని ఎన్నుకున్నట్లు మిగతా సభ్యులు ఆరోపిస్తున్నారు. కమిటీలో అంతా కేవలం ఒక పార్టీకి చెందిన వారే ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే విషయమై సభ్యులు ఇటీవల అనంతపురంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. కమిటీ ఎన్నిక విషయంలో ఓ ఎఫ్‌డీఓ అంతా తానై వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి. ఎన్నిక విషయమై ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధునాయక్‌ను ప్రస్తావించగా ఎఫ్‌డీఓ పక్కీరయ్య నివేదిక ఆధారంగా ఎన్నిక నిర్వహించామని చెప్పుకొచ్చారు.

సురక్షిత ప్రయాణమే లక్ష్యం

అనంతపురం సెంట్రల్: సురక్షిత ప్రయాణమే ఆర్టీసీ లక్ష్యమని ప్రజా రవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోని పేర్కొన్నారు. శనివారం ఆయన చాంబర్‌లో జిల్లాలోని డిపో మేనేజర్లు, ట్రాఫిక్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ప్రజా రవాణా అధికారి మాట్లాడుతూ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సమయ వేళల్లో మార్పులు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు బస్సులను కండీషన్‌లో ఉంచాలన్నారు. కార్గో ద్వారా సరుకు డెలివరీ వేగవంతంగా జరగాలని, డోర్‌డెలివరీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. డిప్యూటీ సీటీఎం రమేష్‌బాబు, డిప్యూటీ సీఎం మోహన్‌కుమార్, డిపో మేనేజర్లు నాగభూపాల్, శంకర్, రామచంద్ర, సురేష్‌కుమార్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను గుర్తించండి



గార్లదిన్నెలో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

గార్లదిన్నె: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు గ్రామీణ క్రీడాకారులను గుర్తించాలని ఎంపీడీఓ విజయభాస్కర్ కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అధికారులు, వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, పీఈటీ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

పుట్లూరు: ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై ఎంపీడీఓ యోగానందరెడ్డి సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ఆడదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గ్రామీణ క్రీడాకారులకు గుర్తించాలన్నారు. ఎంఈఓ శ్రీదేవి, ఈఓఆర్డీ యోగానందరెడ్డి పాల్గొన్నారు.

వార్డు సచివాలయాల తనిఖీ

గుత్తి: పట్టణంలోని పలు వార్డు సచివాలయాలను శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. 3వ సచివాలయం శానిటరీ సెక్రటరీ గంగా భవాని, 9వ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ విజయలక్ష్మి అనుమతి లేని లీవ్ తీసుకున్నట్లు తేలింది. దీంతో వీరికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. హాజరు పట్టికలో సంతకం చేయని, యూనిఫారం ధరించని 13 మందికి మెమోలు జారీ చేశారు.

సర్వమత సమానత్వ వారోత్సవాలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో శనివారం శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో సర్వమత సమానత్వ వారోత్సవాలు నిర్వహించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ అశోక్ నేతృత్వంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు, వకృత్వ పోటీలు నిర్వహించారు. ఎన్‌సీసీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బీకేఎస్‌లో విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళాల మొత్తాన్ని బెటాలియన్ కమాండెంట్ ద్వారా ఎన్‌సీసీ డైరెక్టరేట్‌కు పంపుతామని ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. కళాశాల డైరెక్టర్ రామకుమార్, అధ్యాపకులు ఆదినారాయణ రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ‘గడప గడపకూ మన ప్రభుత్వం’

బుక్కరాయసముద్రం: గోవిందపల్లి పంచాయతీలోని రాఘవేంద్ర కాలనీలో ఆదివారం ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ అంకే నరేష్ తెలిపారు. మధ్యాహ్నం అదే పంచాయతీలోని భద్రంపల్లి, గోవిందపల్లి, బోయ కొట్టాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఏపీ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

సచివాలయం సందర్శన

పామిడి: మోడల్‌స్కూల్ విద్యార్థులు శనివారం అంబేడ్కర్ కాలనీలోని సచివాలయం-2ను సందర్శించారు. సచివాలయ పనితీరును అడ్మిన్ ఈశ్వరయ్య, డిజిటల్ అసిస్టెంట్ అనూష విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ అరుణ, వృత్తి విద్యా బోధకురాలు కృష్ణవేణి పాల్గొన్నారు.

రేపు లక్ష దీపారాధన

పామిడి: స్థానిక భోగేశ్వరాలయంలో సోమవారం సాయంత్రం లక్షదీపారాధన నిర్వహించనున్నట్లు ఆలయ పాలక మండలి చైర్మన్ ఎస్ మురళీధర్‌గుప్తా, ఈఓ క్రిష్ణయ్య, ఆలయ ప్రధాన అర్చకుడు డీ రామేశ్వరశర్మ తెలిపారు. సాయంత్రం 4 గంటలలోపు భక్తులు తాము సమర్పించే నూనె, వత్తులు ఆలయ కమిటీకి ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

సంక్షిప్త సమాచారం

జగనన్న లేఅవుట్‌లో ముళ్లపొదల తొలగింపు

యాడికి: రాయలచెరువులో ఆదర్శ పాఠశాల ఎదురుగా ఉన్న జగనన్న లే అవుట్‌లో శనివారం వైఎస్సార్‌సీపీ నేత తలారి నాగేష్ ముళ్ల పొదలు తొలగింపజేశారు. గతంలో గుత్తి రహదారిలో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాల సమీపంలో ఉన్న గనుల యజమానులు అక్కడ కాలనీ నిర్మించకూడదని కోర్టును ఆశ్రయించటంతో రద్దు చేశారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులతో మాట్లాడి ఆదర్శ పాఠశాల ఎదురుగా ఉన్న సర్వే నం:103 ఎఫ్‌లోని 5 ఎకరాల భూమిలో ఇళ్లలేని 118 మందికి ఇంటి స్థలం మంజూరు చేయించారు.